క్లుప్తంగా

రేపు రక్తదాన శిబిరం

మోపిదేవి: స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు తెలిపారు. మండలంలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వస్వామివారి దేవస్థానం, స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లలో తమ సహకారం అందించాలని శనివారం ప్రచారం నిర్వహించారు. చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ అవనిగడ్డ గాంధీక్షేత్రంలో ఈనెల 4న ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రావి రత్నగిరి, రెడ్‌క్రాస్ మోపిదేవిశాఖ ప్రతినిధులు రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, కందుల సీతారామయ్య, విశ్వనాధుని మురళీ మోహన్ పాల్గొన్నారు.

5న స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా

మోపిదేవి: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5న చేపట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ రాజశేఖర్ కోరారు. ఈ సందర్భంగా మోపిదేవిలో శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ బిల్లులు అధికంగా రావడమే కాకుండా రిపేర్లు కూడా అధికంగా ఉంటాయని తెలిపారు. పేద ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ చేపట్టిన ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

పెడన: పురపాలక సంఘ పరిధిలో జూన్ 30, 2025కు ముందు రిజిస్టర్ అయిన ప్లాట్లు, లే అవుట్లను పురపాలక సంఘ కార్యాలయంలో 90 రోజుల్లోగా క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 రూల్స్ సవరించిన రూల్స్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశాన్ని కల్పించిందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, పురపాలక సంఘ కార్యాలయంలో ఆన్‌లైన్ చేస్తారని, ఆయా దరఖాస్తులను పరిశీలించి ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగా ఛార్జీలు చెల్లించిన వారికి స్థలాలను క్రమబద్ధీకరించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. అవసరమైన వారు తక్షణం తమ స్థలాలను, ప్లాట్లను, లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

అంకమ్మతల్లి, పోతురాజు సంబరాలు ప్రారంభం

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండలంలోని కొక్కిలిగడ్డలో గ్రామ దేవతలు అంకమ్మ తల్లి, పోతురాజు,ఓలేరమ్మతల్లి, మారెమ్మతల్లి అమ్మవార్ల సంబరాలు శనివారం ప్రారంభించారు. ఉదయం సమీపంలోని బొబ్బర్లంక కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం దారిపొడవునా గ్రామ దేవతలను దర్శించుకుంటూ సంబరాలు నిర్వహించారు. పొలి మేరలో అమ్మవారి ముగ్గు వేసి మేళతాళాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామానికి చేరుకున్నారు. రెండో రోజు ఆదివారం అంకమ్మ తల్లి, పోతురాజు శిలల వద్ద గ్రామ సంబరం నిర్వహించిన అనంతరం నైవేద్యాలు సమర్పించుకుంటారని నిర్వాహకులు తెలిపారు.

కేవీకేలో ముగిసిన శిక్షణ



ఘంటసాల: సమయానుకూలమైన మెలకువలు పాటించడం ద్వారా నాణ్యమైన వరి విత్తనాలు ఉత్పత్తి చేయవచ్చని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న వరిలో నాణ్యమైన విత్తన ఉత్పత్తిపై ఆరు రోజుల నైపుణ్యత శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న గ్రామీణ యువతకు సర్టిఫికెట్లను సుధారాణి చేతుల మీదుగా అందించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, డాక్టర్ వి.మంజువాణి, డాక్టర్ కె.రేవతి, యువత పాల్గొన్నారు.

అధికార సమావేశమా.. పార్టీ సమావేశమా..!

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జరిగిన అన్నదాత సుఖీభవ మచిలీపట్నం నియోజకవర్గ కార్యక్రమంలో అధికారిక సమావేశమా లేక పార్టీ సమావేశమా అన్న చందంగా మారింది. రైతులకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పేరుతో నగదు జమ చేసే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కొంతమందికి పదవులు ఉన్నా మరికొంత మందికి పదవులు లేకపోయినా వారిని వేదికపై కూర్చోబెట్టడం చర్చనీయాంశమైంది. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ కాకుండా మిగిలిన కూటమినాయకులకు ఎటువంటి పదవులు లేకపోయినా వారిని వ్యవసాయాధికారులు అందలం ఎక్కించటం పలు విమర్శలకుతావిస్తోంది. అన్నదాత సుఖీభవ మచిలీపట్నం నియోజకవర్గ కార్యక్రమం పార్టీ సమావేశంగానే జరిగిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం కింద నియోజకవర్గ పరిధిలోని 7,526 మంది రైతులకు రూ.5.22 కోట్ల విలువైన మెగా చెక్కును ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు చేతుల మీదుగా అందజేశారు.

ఇష్టారాజ్యంగా కేబుల్ వైర్లు



ఎస్సార్‌వైఎస్పీ కళాశాల వద్ద చల్లపల్లి- మచిలీపట్నం ప్రధాన రహదారి పక్కన పడివున్న కేబుల్ వైర్లు



చల్లపల్లి పడమరవీధిలో పిల్లలకు అందేంత ఎత్తులో వేలాడుతున్న కేబుల్ వైర్లు

- విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లు
- కేబుళ్ల ఏర్పాటులో అడుగడుగునా నిర్లక్ష్యం
- ప్రమాదాలకు ఆస్కారం ఉందంటున్న ప్రజలు
- స్తంభాలపై అధికారుల పర్యవేక్షణ కరువు

చల్లపల్లి: కేబుల్, ఇంటర్నెట్ వైర్లను ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాలకు కట్టి వాటిని నిర్లక్ష్యంగా కిందకి వదిలివేయటంతో అవి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కేబుల్ నెట్‌వర్క్ వచ్చిన కొత్తలో విడిగా ఇళ్లకు కట్టుకుంటూ వెళ్లి కనెక్షన్లు ఇచ్చుకునేవారు. గత కొంతకాలంగా కేబుల్, ఇంటర్నెట్ వైర్లను విద్యుత్ స్తంభాలకే కట్టుకుని అందుకుగానూ ప్రతినెలా కొంత మొత్తం అద్దె చొప్పున విద్యుత్ శాఖకు కేబుల్ ఆపరేటర్లు చెల్లిస్తున్నారు.

సబ్ డివిజన్ పరిధిలో..

చల్లపల్లి సబ్ డివిజన్ పరిధిలోని చల్లపల్లిలో 624, ఘంటసాలలో 716, మోపిదేవిలో 1,210 మొత్తం మూడు మండలాల్లో కలిపి 2,550 కరెంటు స్తంభాలకు కేబుల్ వైర్లు కట్టినట్లు అధికారిక లెక్కలు చెపుతున్నాయి. స్తంభాలకు కేబుల్ వైర్లను కట్టుకున్నందుకు కేబుల్ ఆపరేటర్లు ఒక్కొక్క స్తంభానికి పట్టణ ప్రాంతంలో అయితే రూ.20 చొప్పున, పల్లెల్లో అయితే రూ.15 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు.



సన్‌ఫ్లవర్ రోడ్డు వద్ద పక్కపక్కనే విద్యుత్ మీటరు, కేబుల్ వైర్లు

సమస్య ఇదీ..

అయితే కేబుల్ వైర్లను విద్యుత్ స్తంభాలకు కట్టే క్రమంలో విద్యుత్ తీగలకు దగ్గరగా కట్టకూడదనే నిబంధన ఉంది. ఆ నిబంధనలను తుంగలో తొక్కి విద్యుత్ తీగలతోపాటే కేబుల్ టీవీ వైర్లను కూడా కలిపి కడుతుండటంతో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. రెండు తీగలు కలిసిపోయి కేబుల్ వైర్లతో కూడా విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉంది. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినప్పుడు కేబుల్ సిగ్నల్స్ ఆగకుండా ఉండేందుకు ప్రస్తుతం పవర్ కేబుల్స్‌ను వాడుతున్నారు. ఈ వైర్లలో సిగ్నల్‌తోపాటు విద్యుత్ సరఫరా కూడా వెళుతూ ఉంటుంది. అందుకే కేబుల్ వైర్లు కూడా కొన్ని చోట్ల షాక్ కొడుతుంటాయి.

చర్యలు తీసుకుంటాం

కరెండు స్తంభాల వద్ద కేబుల్ వైర్లను కట్టలుగా కట్టి అలా వదిలేస్తే చర్యలు తీసుకుంటాం. వీటి వల్ల జరిగే ప్రమాదాలకు కేబుల్ ఆపరేటర్లే బాధ్యత వహించాలి. కేవలం స్తంభాలను మాత్రమే తాత్కాలికంగా లీజుకు ఇచ్చాం. ప్రమాదకరంగా ఉన్న వైర్లను తక్షణం తొలగించాలి.

– శివనాగేశ్వరరావు, ఏడీఈ, చల్లపల్లి సబ్‌డివిజన్

ఇలా వదిలేస్తే ఎలా?

చాలాచోట్ల కేబుల్ వైర్లను భవిష్యత్ అవసరాల కోసం విద్యుత్ స్తంభాలకే కట్టలుగా చుట్టి అలా వదిలేస్తున్నారు. కొన్నిచోట్ల అవి మరీ కింద ఎత్తులో, మరికొన్ని చోట్ల నేలమీదే వదిలేస్తున్నారు. ప్రతి 10 స్తంభాల్లో ఆరు స్తంభాలకు కేబుల్ వైర్లు కింద, నేలమీద వేళాడుతు న్నాయంటే కేబుల్ సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఆవైర్లు గాలికి కదులుతూ ప్రమాదాలకు కారణమతున్నాయి. పలువురు ఈ వైర్లు తగిలి పడిపోయి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. స్తంభాలకు ఏర్పాటు చేస్తున్న కేబుల్, ఇతర వైర్ల తీరుపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ఉండకుండా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు యూరియా, డీఏపీ సరఫరా చేయాలి

- మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- పురిటిగడ్డ పీఏసీఎస్‌లో ఎరువుల నిల్వలు పరిశీలన



పురిటిగడ్డ పీఏసీఎస్ సెక్రటరీ నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

చల్లపల్లి: ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో యూరియా, డీఏపీ ఎరువులను తక్షణమే సరఫరా చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పురిటిగడ్డ పీఏసీఎస్‌ను శనివారం ఆయన పరిశీలించారు. యూరియా, డీఏపీ నిల్వలు, పంపిణీ తీరును సెక్రటరీ నాగేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎకరాకు అరబస్తా చొప్పున యూరియాను ఇస్తున్నామని సోమ, మంగళవారాల్లో లోడు రాగానే పూర్తిస్థాయిలో ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ఎకరాకు బస్తా చొప్పున యూరియా అవసరం కాగా కేవలం అరబస్తా మాత్రమే ఇచ్చి చేతులెత్తేయటం సిగ్గుచేటన్నారు. అవినిగడ్డ వ్యవసాయాధికారిని అడిగితే అన్ని పీఏసీఎస్‌లలో యూరియా, డీఏపీ నిల్వలు ఉన్నట్లు చెప్పారన్నారు. తీరా చూస్తే కేవలం ఒక్క నాగాయలంక మండలంలోని గుల్లలమోద, కమ్మవారిపాలెం మొత్తం మీద రెండు పీఏసీఎస్‌లలో మాత్రమే యూరియా, డీఏపీ నిల్వలు ఉన్నాయన్నారు. ఇది కూటమి ప్రభుత్వం పనితీరని ఎద్దేవా చేశారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ఎరువులు లేక రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే రైతు ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వ మేలుకుని యూరియా, డీఏపీ కొరత లేకుండా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. అనంతరం రైతులతో కలిసి పీఏసీఎస్ కార్యదర్శికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో అవనిగడ్డ జెడ్పీటీసీ సభ్యులు చింతలపూడి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రచార కమిటీ విభాగ కార్యదర్శి గాజుల జయగోపాల్, వైఎస్సార్ సీపీ ఘంటసాల మండల కన్వీనర్ వేమూరి వెంకట్రావు, నడకుదురు, పులిగడ్డ సర్పంచులు గొరిపర్తి సురేష్, విజయ్, పార్టీ నాయకులు పరుచూరి వెంకటేశ్వరరావు, మోపిదేవి ద్వారకానాథ్, వెనిగళ్ల తారకజగదీష్, జుజ్జువరపు భాగ్యారావు, గొరిపర్తి రమేష్, రైతు నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలో రీ సర్వే వివరాల వెల్లడి

టి.కొత్తపాలెం(నాగాయలంక): మండలంలోని టి.కొత్తపాలెంలో భూముల రీ సర్వేపై శనివారం గ్రామసభ నిర్వహించారు. మండల తహసీల్దార్ సీహెచ్.వీరాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ పరిధిలోని వ్యవసాయ భూముల రీ సర్వే పూర్తి కావడంతో తాజా సర్వే ఆధారంగా డ్రాఫ్ట్ (రికార్డ్స్ ఆఫ్ రైట్స్) జిల్లా కలెక్టర్ ఆమోదించారని చెప్పారు. సభలో రీసర్వే డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు డ్రాఫ్ట్ ఆర్ఓఆర్‌లో భూ వివరాలు చదివి వినిపించగా రైతులు తమ సంతృప్తి వ్యకం చేశారు. వీటిపై రైతుల సందేహాలను తహసీల్దార్ ఆంజనేయ ప్రసాద్ నివృత్తి చేశారు. తాజా సర్వే ఆర్ఓఆర్‌లో రైతులు తమ భూములను పరిశీంచుకున్నారు. గ్రామ సర్పంచి బండ్రెడ్డి శివపార్వతి, బండ్రెడ్డి హరి, మండల సర్వేయర్ డి.సుధీర్‌బాబు, వీఆర్వోలు తలగడదీవి గంగాధర సాయిబాబు, ఎం.అజయ్‌బాబు, విలేజి సర్వేయర్ ఎస్.చైతన్యవర్మ, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే



సాక్షి ఎఫెక్ట్..

పాపవినాశనం(ఘంటసాల): మండలంలోని పాపవినాశనం ఎస్సీ కాలనీలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయని శనివారం ప్రచురితమైన కథనంతో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఇప్పటికే రెండు సార్లు గ్రామంలో బ్లీచింగ్ చల్లించడంతో పాటు ఎబెట్ మందును పిచికారీ చేయించామని పంచాయతీ కార్యదర్శి అన్వర్ షరీఫ్ తెలిపారు. మరోసారి దోమల మందు, బ్లీచింగ్ చల్లిస్తామని చెప్పారు. ఇటీవల తాగునీరు పరీక్ష చేయించగా బాగానే ఉన్నాయని, జ్వరాలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో అధిక ఫీజులను నియంత్రించాలి

బీసీ సంక్షేమ సంఘం డిమాండ్



డీఎంహెచ్ఓ డాక్టర్ శర్మిష్ఠకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మచిలీపట్నంఅర్బన్: జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్, ల్యాబ్, స్కానింగ్, ఎక్స్‌రే కేంద్రాలలో రోగుల నుంచి అధికంగా వసూలు చేస్తున్న ఫీజులపై నియంత్రణ విధించేలా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎస్.శర్మిష్ఠకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు వైద్య రంగంలో నియంత్రణ లేకుండా రోగుల నుంచి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తుండటంతో ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందన్నారు. ఫలితంగా పేద, మధ్యతరగతి ప్రజలు వైద్య సేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మెడికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టాలు 2002, 2007, 2009 నిబంధనల ప్రకారం ప్రతి ప్రైవేటు ఆసుపత్రి, క్లినిక్, ల్యాబ్, స్కానింగ్, ఎక్స్‌రే కేంద్రాలలో బోర్డులు ఏర్పాటు చేసి వైద్యసేవల ధరలు ప్రదర్శనకు ఉంచాలన్నారు. దాంతో అవినీతిని అడ్డుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భోగిరెడ్డి సుభాని, జన్ను గోవిందు, నిక్కు రాధాకృష్ణ, అన్నారి, కొండేటి మోహన్, చోడవరపు సుబ్బు, నాగుపేట శివ, చేబోయిన కోటయ్య, ఎం.గోపి, పి.సాంబశివ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

గూడూరు: ప్రభుత్వం చేపట్టిన స్వామిత్వ సర్వేతో గ్రామాల్లోని భూ సమస్యలకు శాస్వత పరిష్కారం లభిస్తుందని తుమ్మలపాలెం సర్పంచి కోడే రేణుకాదేవి అన్నారు. స్వామిత్వ సర్వే ఫేజ్–2లో తుమ్మలపాలెం గ్రామం ఎంపికైన నేపథ్యంలో సర్పంచి కోడే రేణుకాదేవి అధ్యక్షతన శనివారం గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్‌లతో కూడిన బృందం ఇంటింటి సర్వే నిర్వహించి సర్వే చేపడ్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ.మణి, వీఆర్వో కె.అంజిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభం

బంటుమిల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు మంజూరు చేసిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం నమూనా చెక్కులను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. శనివారం మల్లేశ్వరం వ్యవసాయ మార్కెట్టు కమిటి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెడన నియోజకవర్గస్థాయిలో 44,383 రైతులకు మంజూరైన రూ.16.14కోట్లు విడుదలయ్యాయన్నారు. ఏఎంసీ చైర్మన్ ఒడుగు తులసీరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కే వీరబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కరకట్టను పరిశీలించిన అధికారులు

టి.కొత్తపాలెం(నాగాయలంక): కృష్ణానది దిగవకు వరద నీటి విడుదల కొనసాగుతుండటంతో మండలంలోని టి.కొత్తపాలెం వద్ద బలహీనంగా ఉన్న కృష్ణానది కరకట్టను, నది ప్రవాహ వేగాన్ని ఇరిగేషన్ ఈఈ రావెళ్ళ రవికిరణ్‌తో కలిసి నాగాయలంక డీసీ చైర్మన్ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు(చిన బాబు)శనివారం సాయంత్రం పరిశీలించారు. ఇరిగేషన్ డీఈఈ గణపతి రావు, ఏఈఈ పాన్నూరు రవితేజ, నీటి సంఘాల అధ్యక్షులు వెంట ఉన్నారు.

వేమూరి మరణం తీరని లోటు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు వేమూరి రామకృష్ణ మరణం తీరని లోటని రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. శుక్రవారం మృతి చెందిన రామకృష్ణ మృతదేమాన్ని కొనకళ్ల నారాయణరావు, కొనకళ్ల బుల్లయ్య, గొర్రెపాటి గోపీచంద్, లంకి శెట్టి బాలాజీ, పి.వి ఫణి కుమార్, వివిధ సంఘాల అధ్యక్షులు బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు శనివారం సందర్శించి నివాళులర్పించారు. మాదిరెడ్డి మెహర్ బాబా, అంబటిపూడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. శనివారం వేముల రామకృష్ణ అంత్య క్రియలు బైపాస్ రోడ్డు హిందూ శ్మశాన వాటిలో జరిగాయి.

వెండి కిరీటం బహూకరణ

గూడూరు: స్థానిక వెంకటాచల స్వామి దేవస్థానంలో గోదాదేవి అమ్మవారికి డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ గమిని వెంకట మురళీకృష్ణ దంపతులు వెండి కిరీటం, పట్టువస్త్రాలు బహూకరించారు. శనివారం ఆలయంలో వారు రూ.30 వేల విలువ కలిగిన వెండి కిరీటం అర్చకులకు అందజేశారు.

హోంగార్డులకు కంటి పరీక్షలు

కోనేరుసెంటర్: జిల్లాలోని వివిధ విభాగాల్లో డ్రైవర్లుగా విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులకు శనివారం ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. అమరావతి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారా యణ కంటి పరీక్షలు చేయించారు. హోంగార్డుల దృష్టి సామర్థ్యాన్ని పరీక్షించి అవసరమైన వారికి చికిత్స చేయించే క్రమంలో ఈ శిబిరాన్ని ఏర్పాటుచేయించినట్లు ఆయన తెలిపారు. దృష్టిలోపం ఉన్న వారిని గుర్తించి సకాలంలో అవసరమైన వైద్యంను అందించి దృష్టిలోపాన్ని నివారించేందుకు ఈ శిబిరం ఏర్పాటుచేశామన్నారు.

సాగు విస్తీర్ణం పెరగాలి

బొబ్బర్లంక(మోపిదేవి): పరిశ్రమ స్థాయికి పామాయిల్ సాగు విస్తీర్ణం పెరగాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. బొబ్బర్లంక గ్రామంలో జిల్లా ఉద్యాన శాఖ, 3ఎఫ్ ఆయిల్ ఫామ్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఆయిల్ ఫాం ప్లాంటేషన్ మేళా శనివారం నిర్వహించారు. ఆయిల్ ఫాం సాగు చేపట్టిన రైతు కోనేరు శివలీలా ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం మత్తి కృష్ణారావు కొత్తగా చేపట్టిన రెండెకరాల్లో ఆయిల్ ఫాం మొక్కలు నా టారు.జిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి, ఉద్యా న శాఖ అధికారి రమేష్, జోనల్ మేనేజర్ విక్రమ్, సర్పంచ్ దొప్పలపూడి గంగాభవానీ, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు అజరామరం



పింగళి, బళ్ళారి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ గంగాధరరావు

జిల్లా ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్: దేశస్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేసిన మహనీయుల త్యాగాలు అజరామరమని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, బళ్ళారి రాఘవల జయంతి వేడుకలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పింగళి, బళ్ళారి చిత్రపటాలకు ఎస్పీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ఔనత్యాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేసేలా పోరాటాలు చేశాడన్నారు. నాటకరంగ ప్రముఖుడు బళ్ళారి రాఘవలు దేశం కోసం తనదైన శైలిలో పోరాడారన్నారు. అలాంటి మహనీయులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అడిషనల్ ఎస్పీ వీవీ నాయుడు, బందరు డీఎస్పీ చప్పిడి రాజా, సీఐలు, ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

అవనిగడ్డ: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పింగళి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య మన ప్రాంత వాసి కావడం మనకెంతో గర్వకారణమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు నలుకుర్తి పృధ్వీరాజ్, గాజుల జయగోపాల్, చింతలపూడి బాలు, సైకం బాబూరావు, షేక్‌నజీర్‌బాషా, నాయకులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమారాణి పింగళి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్థానిక గాంధీక్షేత్రంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంలో..

చల్లపల్లి: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి పేర్ని మాధవేంద్ర రావు ఆధ్వర్యంలో తొలుత వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈసందర్భంగా పలువురు పింగళి వెంకయ్య దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ పి.కృష్ణకుమారి, ఇతర పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న పింగళి వెంకయ్య విగ్రహానికి ఎంపీపీ కోట విజయరాధిక పూల మాలలు వేసి నివాళులర్పించారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పింగళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



కృష్ణా విశ్వవిద్యాలయంలో..

కేయూలో పింగళి జయంతి

కోనేరుసెంటర్: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని కృష్ణా విశ్వవిద్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం వద్ద పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెక్టార్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ పతాకాన్ని రూపొందించిన రూపశిల్పి పింగళి వెంకయ్య కృషా జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.ఉష, ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రావణి అధ్యక్షతన జరిగిన సభలో విద్యార్థులు భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. ఫిజికల్ డైరెక్టర్ గోపి, సహాయ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

మచిలీపట్నంటౌన్: స్వాతంత్ర సమరయోధుడు, భారత జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య, రంగస్థల నటుడు బళ్ళారి రాఘవలకు శనివారం పలువురు నివాళులర్పించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, ప్రముఖ రంగస్థల నటులు బళ్లారి రాఘవ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు రెవెన్యూ అధికారి సమ్మెట వెంకటేష్, ఉద్యోగులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన పింగళి వెంకయ్య జాతికి ఒక పతాకం ఉండాలని గుర్తించి జాతీయ పతాకం రూపొందించిన మహనీయుడన్నారు. స్థానిక ఆంధ్రజాతీయ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేసి ఎంతో మందిని ప్రయోజకులుగా తీర్చిదిద్దారన్నారు. రంగస్థల నటుగు బళ్లారి రాఘవ నాటక రంగ అభివృద్ధికి విశేష సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కార్యాలయ మేనేజర్ కేఎస్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ బీ లక్ష్మి, పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేతకు సింహాద్రి పరామర్శ

చల్లపల్లి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పరుచూరి వెంకటేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేషబాబు శనివారం పరామర్శించారు. అనారోగ్యానికి గురైన వెంకటేశ్వరరావు ప్రస్తుతం కోలుకుంటున్నారు. విషయం తెలుసుకున్న సింహాద్రి రమేష్‌బాబు పురిటిగడ్డలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సింహాద్రి రమేష్‌బాబు వెంట అవనిగడ్డ జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, రాష్ట్రప్రచార కమిటీ విభాగ కార్యదర్శి గాజుల జయగోపాల్, నడకుదురు సర్పంచ్ గొరిపర్తి సురేష్, పులిగడ్డ సర్పంచ్ విజయ్, నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, ఘంటసాల మండల కన్వీనర్ వేమూరి వెంకట్రావ్, వెనిగళ్ల తారక జగదీష్, జుజ్జువరపు భాగ్యారావు, గొరిపర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పరుచూరిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తదితరులు

బిడ్డకు తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

కృత్తివెన్ను: బిడ్డకు తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ బంటుమిల్లి సీడీపీవో సముద్రవేణి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం కృత్తివెన్ను మండలం చినపాండ్రాక సెక్టార్‌లోని చినపాండ్రాక బీసీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు తల్లిపాలనే ఆహారంగా అందించాలని, తరువాత రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారాన్ని బిడ్డకు అందించాలన్నారు. తల్లి పాలు బిడ్డకు సంజీవనిలా పనిచేస్తాయన్నారు. పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రావణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

దాలిపర్రు(ఘంటసాల): మండలంలోని దాలిపర్రు, ఘంటసాల, ఇతర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ నెల 8వ తేదీ వరకు గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న అవగాహన సమావేశాల్లో పాల్గొని విజయవంతం చేయాలని సూపర్‌వైజర్ రమా నాగమణి తెలిపారు. ఈ కార్యక్రమంలో దాలిపర్రు సర్పంచ్ దోకిపర్తి శాంత కుమారి, ఇన్‌చార్జి ఈవో నాగ నాంచారమ్మ, ఏఎన్ఎంలు జయలక్ష్మి, సునీత, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లి పాల వారోత్సవాలు

పెడన: స్థానిక ఐదో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీని శనివారం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, ఆరో వార్డు కౌన్సిలర్ అబ్దుల్ ఖయ్యూం (బాబులాల్), వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు కోమట్ల అనిల్ తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పవల్లి మాట్లాడుతూ ఏటా ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రోగ్రాం అంతర్జాతీయ కార్యక్రమంగా రూపుదిద్దుకుందని తెలిపారు. పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



ఐదో వార్డులో తల్లిపాల వారోత్సవ ర్యాలీలో ఖాజా, కటకం ప్రసాద్ తదితరులు

తల్లిపాలతో శిశువుకు ఎన్నో పోషకాలు

మచిలీపట్నంటౌన్: శిశువులకు తల్లిపాలు ఇవ్వడం వల్ల ఎన్నో పోషకాలు లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్వైజర్ ఏ లక్ష్మి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం నగరంలోని కాలేఖాన్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ లక్ష్మి మాట్లాడుతూ శిశువుకు జన్మనిచ్చిన అరగంటలోపు నుంచే తల్లి ముర్రి పాలను ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా కిషోర్ బాలికలతో మొక్కలు నాటించారు. గర్భిణులు, బాలింతల గృహాలకు వెళ్లి తల్లిపాల ప్రాముఖ్యతను కుటుంబ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జి.సుధారాణి, ఎమ్మెస్‌కేవై రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు డి.నాగమహాలక్ష్మి, కె.హరిత, కె. సాయి అలేఖ్య, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

గూడూరు: పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ మల్లవోలు సెక్టారు సూపర్‌వైజర్ జన్ను రేవతి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం మండల పరిధిలోని చిట్టిగూడూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ అఖిల, ఏఎన్ఎం హేమలత, అంగన్‌వాడీ వర్కర్ వెంకట రమణ, ఆశావర్కర్ విమల తదితరులు పాల్గొన్నారు.